# యాభైనోటు

"శర్మగారూ! మీకు ఫోను!"

ఆఫీసుకి బయల్దేరదామని స్కూటరు 'స్టార్ట్' చేయబోతూంటే పక్క వాటా గుమ్మం లోంచి రామ్మూర్తిగారు పిలిచారు.

స్కూటరు స్టాండ్ వేసి వాళ్లింట్లోకి వెళ్లాను.

"మీ బ్రదర్నించి !" – అంటూ ఆయన 'కార్డ్‌లెస్' అందించారు.

"హలో!" అన్నాను.

"నేనే అన్నయ్యా... రాజాని!"

రాజా నా తర్వాతివాడు. ఎల్.ఐ.సీ.లో పనిచేస్తున్నాడు.

"ఏమిటో చెప్పు!" – యథాలాపంగానే అడిగాను.

"మా బాస్ జగన్మోహనరావుగారు తెలుసుగా... వాళ్ళబ్బాయి నిన్ననే 'స్టేట్స్' నించి వచ్చాడు. ఓ నెలరోజులుంటాట్ట... ఈలోగా అతని 'మ్యారేజ్' చేసేయాలనుకుంటున్నారు.... మాటల సందర్భంలో మంచి సంబంధం ఏదైనా ఉంటే చెప్పుమ'ని అడిగారు!"

ఇదంతా వాడు నాకెందుకు చెప్తున్నాడో అర్థంకాలేదు... ఇంతలోనే మళ్ళీ చెప్పాడు.

"అబ్బాయి చాలా బావుంటాడన్నయ్యా!.మన శ్యామలని వాళ్ళకి చూపిద్దామని ఫోన్ చేశాను."

నాకు మగపిల్లాడైనా, ఆడ పిల్లయినా శ్యామల ఒక్కత్తే సంతానం. దాని పెళ్లి గురించి నేనింకా అసలు ఆలోచించటంలేదు. మొన్ననే పంథొమ్మిది నిండింది. 'బీఎస్సీ' ఫైనలియర్ చదువుతోంది. అది పూర్తయ్యాక ఏ కంప్యూటర్ కోర్సులోనో చేర్పించాలనుకుంటున్నాను.

"శ్యామలకి అప్పుడే పెళ్లేమిట్రా?... ఇంకా బీఎస్సీ కూడా పూర్తవలేదు!" – అన్నాను.

"ఇంక మూడు నెలల్లో అయిపోతుందిగా! వాళ్ళకి పిల్ల నచ్చి 'ఓ.కే.' అంటే ముందు పెళ్లి చేసేద్దాం... తరవాత ఆ అబ్బాయి అమెరికా వెళ్లి వీసా పేపర్లూ అవీ పంపిస్తాడు... ఇంతలో మన శ్యామలకి ఇటు పరీక్షలూ అయిపోతాయి... అటు పాస్‌పోర్టూ తీసుకోవచ్చు" రాజా చెప్పింది కూడా సబబుగానే తోచింది.

కానీ వాళ్లు శ్యామలను చూసుకున్నాక – నచ్చిందని చెప్పి – అర్జంటుగా పెళ్లి చేసేయమంటే – ఎలాగన్నదే సమస్య! నేను చేస్తున్నది ఆర్టీసీలో అతి మామూలు ఉద్యోగం.

ఇంక నాకు ఏణ్ణర్థమే సర్వీసుంది. ఆ తరవాత, ప్రావిడెంట్ ఫండ్‌తోసహా 'రిటైర్‌మెంట్ బెనిఫిట్స్' అన్నీ కలుపుకుని ఓ మూడు లక్షలదాకా వస్తాయి. అప్పుడా డబ్బుతో శ్యామల పెళ్లి ఘనంగా చేయాలని నా సంకల్పం!...

"హలో! ఏమిటన్నయ్యా ఆలోచిస్తున్నావ్?" - నానించి వెంటనే జవాబు రాకపోయేసరికి మళ్లీ అడిగాడు రాజా.

"మరేం లేదురా!... ఒకవేళ వాళ్లకి మన శ్యామల నచ్చి వెంటనే పెళ్లి చేసేయమంటే... ఫైనాన్షియల్‌గా... అన్నీ చూసుకోవాలికదా.... అని!"

"నిజమే... ఏదో తంటాలుపడాలి. అయినా ఇపుడు కాకపోతే మరో ఏడాది తరవాతైనా చేయాలి కదా?... ఇది బంగారం లాంటి సంబంధం.... ఒక్కడే కొడుకు... ప్రాపర్టీ కూడా బాగానే ఉంది..."

"చూద్దాంలే... మీ వదినతో మాట్లాడి - రాత్రికి ఫోన్ చేస్తాను!" - చెప్పాను.

"అంత టైం లేదన్నయ్యా... మంచి సంబంధం కదా - ఎక్కడ చేజారిపోతుందో నన్న ఆలోచనతో - నీ పక్షాన నేనే మా బాస్‌తో మాట్లాడాను... నా దగ్గరి ఆల్బమ్‌లో ఉన్న శ్యామల ఫోటో కూడా చూపించాను. వాళ్లందరికీ నచ్చినట్టుంది! 'ఇవాళ మంచిరోజుకదా, సాయంత్రం వచ్చి పిల్లను చూసుకుంటామని మీ బ్రదర్‌కి చెప్పండి' - అన్నారు! అందుకే ఫోన్ చేశాను!" - చెప్పాడు రాజా.

ఇంకేం మాట్లాడాలో తెలీలేదు... "సాయంత్రం అయిందింటికి - వాళ్లను నేను టాక్సీలో తీసుకొస్తాన్లే... మీరు శ్యామలను రెడీ చేసి ఉంచండి... ఉంటాను!" - మరో మాట చెప్పే అవకాశం నాకు ఇవ్వకుండా వాడు ఫోన్ పెట్టేశాడు.

"ఏమిటీ... మీ శ్యామలకేదైనా పెళ్ళి సంబంధమా?" - 'కార్డ్‌లెస్ ఫోను' నా చేతిలోంచి అందుకుంటూ అడిగారు రామ్మూర్తిగారు.

రామ్మూర్తిగారు గత పదిహేనేళ్ళనించీ మా ఇంట్లోనే అద్దెకుంటున్నారు... ఆలిండియా రేడియోలో పనిచేసి రిటైరయ్యారు. అయిదు వేలకుపైగా పెన్షన్ వస్తుంది. రిటైరైనప్పుడు వచ్చిన ప్రావిడెంటు ఫండూ, గ్రాట్యుయిటీ అన్నీ కలిపి బ్యాంకులో వేసుకున్నారు. నాలుగైదు వేలు వడ్డీ వస్తుంది.. ఆయనకు ముగ్గురు పిల్లలు... ఇద్దరు అమెరికాలో సెటిలయ్యారు. మూడోవాడు బెంగుళూరులో పనిచేస్తున్నాడు. ముగ్గురికీ పెళ్ళిళ్ళయి పోయాయి. చీకూచింతా లేకుండా 'రిటైర్డ్ లైఫ్' దర్జాగా గడుపుతున్నారాయన. తమ పిల్లలతో తరచూ మాట్లాడేందుకు వీలుగా టెలిఫోన్ సౌకర్యం ఏర్పాటు చేసుకున్నారు. పేరుకి ఆయనదే అయినా దాన్ని మేం కూడా సొంతఫోన్‌లా ఉపయోగించుకుంటూంటాం. ఆయనా మా ఇంట్లో మెంబరులాగే అనిపిస్తారు...

అందుకే ఆయనతో విషయమంతా చెప్పాను.

"శుభం! అయితే మాకు త్వరలోనే విందుభోజనాలున్నాయన్నమాట!" అన్నారు ఆనందంగా.

ఇంట్లోకెళ్లి మా అవిడక్కూడా చెప్పాను... ముందు కొంచెం ఆశ్చర్యపడి తరవాత ఎంతో సంతోషపడింది!

"పోన్లెండి! వాళ్లకి నచ్చితే పెళ్లి చేసేద్దాం! అమెరికా అల్లుడు దొరకటం అంటే ఆకాశాన్ని అందుకోవటమేనట... పక్క వీధిలో ఉంటున్న పాపాయమ్మ పిన్నిగారు చెప్పారు. వాళ్ళ పెద్దమ్మాయి అమెరికాలోనే ఉంటోందిగా!... మొన్నీమధ్య ఆ పిల్లకు పురుడు పోసేందుకు ఆవిడ అమెరికా వెళ్లొచ్చింది... మనక్కూడా అలాంటి యోగం ఉందేమో?"– ఎగిరి గంతేయలేదన్నమాటేగానీ, ఆ స్థాయిలో తన సంతోషాన్ని వ్యక్తం చేసింది.

కానీ నాకు మాత్రం అంత సంతోషం కలగలేదు. అందుకు కారణం – ఫైనాన్షియల్ ప్రాబ్లం!

ఆడపిల్ల పెళ్లి చేయటం అంటే ముందుగా ఎదురయ్యేది కట్న సమస్య. ఆమాట అనటానికి చట్టం ఒప్పుకోకపోయినా – లోపాయకారీగా అంతో ఇంతో ఏదో ఒక రూపంలో ముట్ట చెప్పాల్సిందే!... ఈమధ్యకాలంలో అమెరికా కుర్రాళ్లు డాలర్ల రుచి మరగి – ఆఫ్ట్రాల్‌గా కనిపించే ఇండియన్ కరెన్సీని కట్నంగా తీసుకోవటం మానేశారు... కానీ వాళ్ళ తల్లితండ్రులు మాత్రం ఖరీదైన కండిషన్లు పెడుతూనే ఉన్నారు. ఆషామాషీగా అయిపోయిందనిపించకుండా పెళ్లి ఆర్భాటంగా జరిపించాలి... ఇంటిముందు షామియానా వేసి సన్నాయి మేళంతో సరిపెట్టకుండా – ఊరిచివర విశాలంగా ఉండే ఏ గార్డెన్సో బుక్ చేసి – సంగీతకచేరి లాంటిది ఏర్పాటు చేయాలి...వంటబ్రాహ్మణులతో వండించి వడ్డించకుండా – కలర్‌ఫుల్ ఐటమ్స్‌తో కేటరింగ్ పెట్టించాలి... ఆడపడుచులుంటే అందల మెక్కించాలి... వియ్యపురాలి లాంఛనాలు సరేసరి!... ఇక వీడియో తీయించటాలూ, ఫోటోలు తీయించటాలూ తప్పనిసరి... పెళ్ళయ్యాక ఏ ఫైవ్‌స్టార్ హోటల్లోనో ఆ 'ముచ్చట' జరిపించాలి... అదయ్యాక ఇటు కాశ్మీరానికో, అటు కన్యాకుమారికో హనీమూన్‌కి వెళ్లేందుకు ఫ్లయిట్ టిక్కెట్లు బుక్ చెయ్యాలి! ఇవి చాలు ఆడపిల్ల తండ్రి 'హార్ట్ ఎటా'కొచ్చి ఆస్పత్రిలో చేరడానికి...! అందుకే నేను ఆలోచనలో పడ్డాను...

అయితే మా ఆవిడ నా మనసు గ్రహించేసింది – "ముందు పెళ్లిచూపులు కానివ్వండి. తక్కిన విషయాలు తరవాత ఆలోచిద్దాం" – అంటూ ధైర్యం చెప్పింది.

నేనూ ఆ బాపతు ధైర్యాన్నే కూడగట్టుకున్నాను.

"ఇవాళ ఆఫీసుకి సెలవు పెట్టేయండి!... ఇల్లంతా కాస్త నీట్‌గా సర్ది -బజారు నించి స్వీటూ, హాటూ కొనుక్కురండి!" - వెంటనే పురమాయించింది.

అసలే నెలాఖరు రోజులు... ఇంకో మూడురోజులగ్గానీ జీతం రాదు... పర్సులో ఓ యాభై నోటూ, నాలుగైదు రూపాయల బిళ్లలూ ఉన్నాయి. స్కూటర్లో పెట్రోలు అయిపోవచ్చింది. ఆ యాభై నోటుతో పెట్రోలు కొట్టిస్తే - ఈ మూడు రోజులూ ఆఫీసుకి వెళ్లిరావచ్చును కుంటున్నాను. ఇంతలోనే ఈ అవాంతరం వచ్చిపడింది. తప్పదుకదా!

ఆఫీసుకి రావటం లేదని - రామ్మూర్తి గారింట్లోంచే మా మేనేజర్‌కి ఫోన్ చేసి చెప్పాను. బజారుకెళ్లి కాసిని స్వీట్లూ, కొంచెం హాటూ ప్యాక్ చేయించాను. పర్సులోంచి యాభై నోటు తీసి ఇస్తూంటే - దానిమీద, కుడివైపు తెల్లగా ఉండేచోట, ఎర్రసిరాతో రాసిన అక్షరాలు యథాలాపంగా నాకంటబడ్డాయి...

"శ్రీరామా...! నీవే కలవు!"

సాధారణంగా రూపాయల కట్టలో నోట్లు లెఖ్ఖ పెట్టుకున్నవాళ్లు - అవి ఎన్ని ఉన్నాయో, ఆ సంఖ్యను పైనున్న నోటు మీద గుర్తుకోసం వేసుకుటుంటారు... కొందరైతే సరదాగా తమ పేర్లు రాసుకుంటూంటారు... కానీ ఇలా రామనామ రచనలు చెయ్యరు.

బహుశా, ఆ యాభై నోటుతో గుర్రప్పందాల్లో జాక్‌పాట్ టిక్కెట్లు కొన్నవాళ్లెవరో అలా రాసుకుని ఉండాలి!... ఆ శ్రీరామచంద్రుడు దయదలిచి తమకు జాక్‌పాట్ తగిలేలా ఆశీర్వదిస్తాడని ఆశపడి ఉండాలి!...

ఏదిఏమైతేనేం - మొత్తానికి పెట్రోలు బంకుకి వెళ్లవలసిన ఆ యాభై నోటు - ఆ విధంగా స్వీటు దుకాణంలోని క్యాష్ బాక్సులో పడింది.

ఇంటికొచ్చాక నేనూ మా ఆవిడా - ఉన్నంతలోనే ఇంటిని అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాం... మరికాసేపట్లో పెళ్లివారు వస్తారనగా రామ్మూర్తిగార్నీ ఆయన భార్యనీ ఆహ్వానించాం... శ్యామలకు మా ఆవిడ పట్టుచీర కట్టింది... తన మెడలో ఉన్న ఒంటి పేట బంగారు గొలుసు తీసి దాని మెడలో వేసింది... నుదుట గుండ్రంగా బొట్టుపెట్టి - పొడవైన వాల్జెడలో ఒకే ఒక గులాబీపువ్వుని అలంకరించి అచ్చమైన తెలుగింటి అమ్మాయిలా తయారుచేసింది...

ఇన్నాళ్లూ అనుకోలేదుకానీ - ఆ అలంకరణలో శ్యామలను చూడగానే, దానికి పెళ్లీడు వచ్చేసినట్టే అనిపించింది ఆ క్షణాన.

అంతేకాదు -

అబ్బాయికి గ్యారంటీగా శ్యామల నచ్చుతుందనీ - కొద్దిరోజుల్లోనే పెళ్లి కూడా

జరిగిపోతుందనీ కూడా అనిపించింది... అప్పుడు హఠాత్తుగా నా కళ్ళల్లోకి కన్నీళ్లు ఉబికివచ్చాయి... గుండె బరువెక్కింది... పెళ్ళయితే, తను మాకు దూరమైపోతుందికదా?

అనుకున్నట్టుగానే అయిదయ్యేసరికి రాజా పెళ్లివార్ని తీసుకొచ్చాడు.

పరిచయాలు పూర్తయ్యాయి. రాజా చెప్పినట్టు అబ్బాయి అచ్చం దొరబాబులాగే ఉన్నాడు. ముందు నేనంతగా ఆశపడలేదుకానీ, కుర్రాణ్ణి చూశాక - అతను అల్లుడైతే బాగుండునని గుర్తుకొచ్చిన దేవుళ్ళకందరికీ మొక్కుకున్నాను... అరగంటలో పెళ్లిచూపుల తంతు ముగించుకుని వాళ్లు వెళ్ళిపోయారు... వెళ్లేముందు అబ్బాయి తండ్రి - 'మీ బ్రదర్‌తో కబురు చేస్తాంలెండి' - అన్నారు. అయితే తెల్లవారే సరికే - "మీకు ఫోనొచ్చిందండీ" - అంటూ రామ్మూర్తిగారు పిలిచారు. ఫోన్లో అబ్బాయి తండ్రే మాట్లాడాడు. వాళ్ళందరికీ శ్యామల నచ్చిందట... మాక్కూడా అబ్బాయి నచ్చితే - వెంటనే వచ్చి తక్కిన విషయాలు మాట్లాడుకోవచ్చునన్నారు. అంత హఠాత్తుగా - కేవలం కొన్ని గంటల వ్యవధిలో శ్యామల పెళ్లి నిశ్చయమైనందుకు మాతోబాటు రామ్మూర్తిగారు కూడా చాలా సంతోషించారు. "అంతేనండీ!... ఆ కళ్యాణ ఘడియ తన్నుకొస్తే ఎవరూ ఆపలేరు... మీ అమ్మాయి అదృష్టవంతురాలు!" - అంటూ అభినందించారు.

ఇలాంటి సందర్భాల్లో ఎలా మాట్లాడాలో, అసలేం మాట్లాడాలో తెలియకపోవటంవల్ల మా కుటుంబ శ్రేయోభిలాషిగా రామ్మూర్తిగార్ని వెంటబెట్టుకుని పెళ్లివారింటికి వెళ్లాను. అనుకున్నట్టుగానే వాళ్లు కట్నకానుకలు అవసరం లేదన్నారు. పెళ్లి మాత్రం ఘనంగా చేయాలన్నారు. ఇరవై రోజుల్లో మంచి ముహూర్తం ఉందట! ఆ ముహూర్తానికే పెళ్లి చేస్తే - కొత్త దంపతులు ఓ పదిరోజులపాటు సరదాగా హనీమూన్ వెళ్లి రావటానికి అవకాశం ఉంటుందనీ - ఆ తరవాత అబ్బాయి అమెరికా వెళ్లిపోయి శ్యామల పరీక్షలు పూర్తయ్యేలోగా వీసా పేపర్లు పంపే ఏర్పాటు చేస్తాడనీ చెప్పారు... అంతా బాగానే ఉంది!... కానీ అప్పుడు అసలైన ప్రాబ్లం - విశ్వరూపం ధరించి నా ఆలోచనల్ని ఆక్రమించుకుంది...

కట్నంకానుకల అవసరం లేకపోయినా - అంతో ఇంతో ఆర్భాటంగా పెళ్లి చేయాలంటే కనీసం ఓ రెండు లక్షలైనా కావాలి... ఎలా...? ఇల్లు తనఖాపెడితే ఆమాత్రం పుట్టకపోదు! అంటూ మా ఆవిడ ఓ ఉచిత సలహా అందించింది. సరిగ్గా అదేక్షణంలో రామ్మూర్తిగారు మా ఇంట్లో అడుగుపెట్టారు.

"మీకు ఎంత కావాల్సి ఉంటుంది?" - కుర్చీలో కూర్చుంటూ అడిగారు. క్షణంపాటు ఆయనవైపు అయోమయంగా చూశాను.

"ఓ రెండు లక్షలు చాలా?" - ఇంతలో మళ్లీ ఆయనే అడిగారు.

"సరిపోవచ్చుననే అనుకుంటున్నాం సార్! అంత డబ్బు ఇప్పుడు అర్జంటుగా ఎలా దొరుకుతుంది చెప్పండి?... అందుకే ఈ ఇల్లు తనఖా పెట్టి–"

"అవసరం లేదులెండి.... నేను ఏర్పాటు చేస్తాను!–" నామాట పూర్తికాకుండానే అన్నారాయన... నా చెవులను నేనే నమ్మలేకపోయాను... ఆ శ్రీరామచంద్రుడే ఆయన రూపంలో వచ్చి మమ్మల్ని ఆదుకుంటున్నాడా అనిపించింది.

"ఫైనాన్స్ కంపెనీలో నాది ఓ రెండు లక్షల డిపాజిట్ ఉంది... ప్రతియేడూ దాన్ని నేను రెన్యూ చేయిస్తుంటాను. దాని మీద నెలకు రెండు వేలు వడ్డీ వస్తుంటుంది. రేపటితో ఏడాది పూర్తవుతుంది... మళ్లీ రెన్యువల్ చేయించకుండా, దాన్ని విత్‌డ్రా చేసేసి మీకిస్తాను... దానిమీద నాకు వచ్చే వడ్డీని – మీరు నెలనెలా ఇస్తూండండి... మీరు రిటైరయ్యాక ఎలాగా డబ్బొస్తుంది కనుక – ఏక మొత్తంగా నా బాకీ అప్పుడు తీర్చేద్దురుగాని!" – విడమరచి చెప్పారు, ఆయన...

"మీ మేలు మరచిపోలేను సార్!" కృతజ్ఞతాపూర్వకంగా ఆయన రెండు చేతులూ పట్టుకున్నాను.

"ఇందులో నేను చేసిన మేలేముందీ?... ఆ ఫైనాన్స్ కంపెనీలో డిపాజిట్ చేసే బదులు మీ ఇంట్లో శుభకార్యానికి అప్పుగా ఇస్తున్నాను... అంతేగా?"

ఆయనకు అంతలా కనిపించవచ్చు... కానీ ఆ సమయంలో ఆయన అందించిన ఆ సహాయం నాకు ఎంతోలా, ఎంతెంతోలా అనిపించింది.

మర్నాడే ఆయన డబ్బు 'డ్రా' చేసి ఇచ్చారు. పెళ్లిపనులన్నీ ప్రారంభమై చకచకా సాగిపోయాయి. రోజులు కూడా గబ గబా దొర్లిపోయాయి.

ఆ శుభముహూర్తం రానేవచ్చింది...

ఎక్కడా ఎలాంటి లోటూ లేకుండా, ఏ అవాంతరం రాకుండా శ్యామల పెళ్లి ఘనంగా జరిగిపోయింది... ఆ రాత్రి ఎనిమిది గంటలవేళ అప్పగింతల తంతు కూడా పూర్తయింది. నిన్న మొన్నటిదాకా పంజాబీ డ్రెస్సులో ఓ స్టూడెంటుగా కాలేజీలో చదువుకునేందుకు వెళ్లిన శ్యామల ఇవాళ పట్టుచీరలో, పచ్చగా మెరసిపోతున్న మంగళసూత్రంతో పెళ్లికూతురై – ఓ ఇంటి ఇల్లాలుగా జీవితాన్ని చదువుకునేందుకు – భర్తతో ప్రయాణమైవెళ్లిపోతోంది!

అప్రయత్నంగా శ్యామల వైపు చూసిన నా కళ్లు నీళ్ళ దోసెళ్ళయ్యాయి... వాటిని దాచుకునే ప్రయత్నం చేస్తూ – శ్యామల వైపు చూడకుండానే – టాటా చెప్తున్నట్టు చేయి ఊపాను.

వాళ్ళ కారు వెళ్లిపోయింది... పెళ్లికొచ్చిన బంధుబలగమంతా అంతకుముందే వెళ్లిపోయారు... వెలవెలబోతూ కనిపించిన ఆ మ్యారేజి హాల్లో నేనూ మా ఆవిడా మిగిలాం! ఇద్దరం ఒకరినొకరం చూసుకుంటూ కొన్ని క్షణాలు అలాగే కూర్చుండిపోయాం...!

ఆ తరవాత – మేరేజి హాల్ వాళ్లకీ, క్యాటరింగ్ వాళ్లకీ – ఇవ్వాల్సిన డబ్బు ఇచ్చేశాను. అక్కడ పనిచేసిన కుర్రాళ్లూ, స్వీపర్లూ ఎవరెవరో వచ్చి చేతులు చాపారు. అందరికీ లేదనకుండా అంతో ఇంతో అందించాను... ఇక నా జేబులో వంద రూపాయల నోటు మిగిలింది... ఇద్దరం రోడ్డుమీదకొచ్చి ఆటో ఎక్కాం.... ఇంటికి చేరుకున్నాక ఆ వంద నోటు ఆటోవాలా చేతిలో పెట్టాను. మీటరు ముప్ఫయ్‌రెండు రూపాయలు చూపిస్తోంది. అప్పటికే పదకొండు దాటింది కనక – అతను 'హాఫ్ రిటర్న్' తీసుకుని నా చేతిలో 'యాభైనోటు' పెట్టాడు...

దాన్ని పర్సులో పెట్టుకుంటూంటే – అక్కడి వీధిదీపం వెలుగులో – ఆ నోటు మీద కుడివైపు తెల్లగా ఉండేచోట – ఎర్రసిరాతో రాసిన అక్షరాలు యథాలాపంగా నాకంటపడ్డాయి–

"శ్రీరామా! నీవే కలవు!"

(ఆదివారం, ఈనాడు)